కథా నిలయం
5429
శ్రీకాకుళం

# సాలె గూడు

నర్సమ్మ కొడుకు అప్పలసామి తల్లికాళ్ళ దగ్గిరి కూర్చున్నాడు. అరుగుమీద కూర్చుంది నర్సమ్మ. చలిగాలి తగలకుండా, చింకిదుప్పటి కప్పుకుంది. దుప్పటి చిరిగి పోయిందని ఏడవక్కర్లేదు నర్సమ్మ - దాని బతుకంతకంటె ఎక్కువగానే చిరుగులు పడిపోయింది. బయటి చలి దానికో లెక్కకాదు-బతుకే చలిపట్టిపోయింది-దాన్ని ఏ దుప్పటితో కప్పడం ? రెండేళ్ళ కిందట మొగుడు చచ్చిపోయిన్నాట్నుండి - ఎప్పుడూ విచారంగా కూర్చుంటుంది నర్సమ్మ. దాని మొగుడు పోలెప్పి ఎంతో మంచివాడు. పెళ్ళాన్ని, పిల్లల్ని, కొసకి గొర్రె పిల్లల్ని కూడా అభిమానంగా చూస్కునీవాడు. ఏనాడూ మందు చుక్కైనా వేస్కునేవాడుకాడు. అంబలి తప్పమరోరకం తిండన్నది ఎరగడు. అయితే మందు వేస్కోపోడానికి, అంబలి తప్ప మరోటి తినకుండా వుండడానికి కారణాలేమిటి ? పోలెప్పి గాంధీమహాత్ముడేవీ కాదు - నాకవకాశం వున్నప్పటికీ తాగను - శనగ్గింజలే తింటాను, అంబలే తాగుతాను అని వొట్టువేస్కోడానికి. పండుగనాడే నా పట్టెడు మెతుకుల్తిండానికి, బుక్కుడు కల్లు తాగడానికి, గజంగుడ్డ కట్టడానికి, ఈ దేశంలో కోట్లాది మందికి ఎందుకు అవకాశంలేదో అందుకే పోలెప్పికీ అవకాశంలేదు-తినాలనుకున్నది తిన్లేక పోడానికి, తాగాలనుకున్నది తాగలేక పోవడానికి.

అయితే పోలెప్పి కూడా ముష్టివేధవేనా? కాదుకాకకాదు. డబ్బున్నవాడా? ఎంత మాత్రంకాదు. గావంచాకి చిన్న గోచికి పెద్ద అంటారే - అదీ వాడి బతుకు. వున్నదల్లా ఓ రెండెకరాల మడిచెక్క. ఏ గోదావరి జిల్లాలోనో అయితే ఈ రెండెకరాలు ఎంత డబ్బుచేసునోనాకు తెలీదు. కానీ శ్రీకాకుళం జిల్లాలో మాత్రం, మెరక ప్రాంతంలో రెండెకరాలు ఎంతపాటి ఆస్తో-అలాటి ఆస్తి ఉన్నవాడికే తెలుస్తుంది. దానిమీద శనక్కాయలు పండించొచ్చు, వరి పండించొచ్చు, చెరుకు వెయ్యొచ్చు, కూరగాయలు దర్జాగా పండించొచ్చు, గోగువెయ్యొచ్చు. అయితే ఎప్పుడివన్నీ సంభవం? నీళ్ళున్నప్పుడు. అవి లేనప్పుడు? కొర్నుంచడమే. శ్రీకాకుళం జిల్లాలో నీరు తక్కువ కనక - సాధారణంగా మెరక పొలాలన్నీ యిదే స్థితిలో వుంటాయి.

చెప్పొచ్చేదేవిటంటే పోలెప్పిగాడి పొలంలో చెప్పుకోదగ్గ పంటలు ఏ నాడూ పండనూ లేదు - వాడింట్లో సిరి సంపదలు తులతూగిపోనూలేదు. అయితే పంటలు పండటం లేదని ఏ రైతేనా మదుపులు పెట్టకుండా కూర్చుంటాడా? కూర్చోడే ! మదుపులు పెడుతూనే వుంటాడు-పంటలు పోతూనే వుంటాయి-మదుపుకోసం తెచ్చిన అప్పులు అలాగే వుంటాయి- వాటిమీద

వడ్డీలు అలా అలా పెరుగుతూనే ఉంటాయి- దరిమిలాను ఆపొలాలు షావుకారు చేతుల్లోకి పోతూనే వుంటాయి, అప్పుకింద. ఈ కథాసంగ్రహం ఏవత్తుమందికి తెలిసిందే. అలాగే వెళ్ళిపోయాయి పోలెప్పి రెండెకరాలున్నూ. పొలం పోయిన్నాడు పోలెప్పి చాలా బాధపడ్డాడు. అనేక రకాలు బాధలు పడ్తానే వున్నాడు చిన్నప్పట్నుండీ. అయితే యీ పొలం పోవడం వుందే- అది వాళ్ళ కుటుంబం ఎన్నడూ పడివుండని బాధ. " గుడ్డి కన్ను గుప్పెడు." అని సామెత చెవతారు- ఆలాంటిదే వాడి పొలం కూడా. అయినా రైతన్నవాడు ప్రాణం పోవడానికేనా యిష్ట పడతాడేఁవోకాని, పొలంపోతే మాత్రం భరించలేడు. అందునా పోలెప్పికి యీ పొలం తాత, తండ్రుల్నుండి సక్రమించింది.

" మా అయ్య, మా తాత సెయ్యలేని పని నేను సేసినాను. ఆల్లు మడిసెక్క లిచ్చినారునాకు- నానేమో ఆట్నీ-అప్పు తీర్సలేక, సావుకోరుగాడికి కిరిసీటి సేసీసినాను. మా అయ్య మా తాత బతికుంటేయీ య్యేల నామొకంమీన వుమ్మనానికిక్కూడా యెనక తీసుండీవోల్లు." అని అంబలి ముందు కూర్చొని పోలెప్పి అన్నాడు. ఆఖరి మాటలువాడి నోటినుండి బయటికి పూర్తిగా రాలేదు. గొంతుకని ఏడుపు నొక్కేసింది. నర్సమ్మ చెయ్యి పట్టుకొని తినమని బతిమాలినా " నాకుముద్ద నోటికెల్లదే - బలిఁవి సెయ్యక" అనేసి లేచిపోయాడు. మొగుడు కూడు తిన్లేదని కొండంత విచారంతో, తను కూడా తిండి మానేసింది నర్సమ్మ. పోలెప్పి అలాగే బెంగ పెట్టేస్కొని, మంచ మెక్కిపోయి (మందూమాకు లేకపోవడంవల్ల కూడా కావొచ్చు) కొండెక్కిపోయాడు.

అప్పలసాఁవికి భయంవేసింది, అమ్మ కూడా అయ్యలాగే విచారంలో కొండెక్కిపోతుందేఁవోనని. "పొలం పోనాదని బెంగెట్టుకొని అయ్యసచ్చిపోన్డు, అయ్యపోనాడని బెంగెట్టుకోని అమ్మసచ్చిపోతే, మర్నానెందలబడిపోవాల?" ఈ సంగతి తెల్సిరాగానే అప్పలసాఁవి అమ్మ దగ్గరికొచ్చి, కాళ్ళ దగ్గర కూర్చున్నాడు. వాడి పెళ్ళాంవచ్చి ఆవతల పక్కని కూర్చుంది. అప్పలసాఁవి ప్రారంభించాడు "అమ్మ, అయ్య సచ్చిపోన్డు, సాల్దేటి? నాకింటికాడ పూరాగ పెద్ద బుర్రనేకంట నేసేస్తావా? అదేటోసెప్పి! పొలం పోనాదని ఆడు బెంగెట్టుకుంటే, ఆ యెనక నువ్వు పోనావని నాను బెంగెట్టుకునస్తే-ఆయెనక నా పెళ్ళాం మాటేటి " అనడిగేడు. కోపంకాదు-అభిమాన వేతల్లంటే ! కోడలు, కొడుకూ చెరోపక్కా కూర్చుని యీ విధంగా అడిగేసర్కి నర్సమ్మ చెప్పుకొచ్చింది. " నాకు రెండు బెంగల్రా నాయనా! మీయయ్యపోనాడు - పూరివీకులు యిచ్చిన పొలం పోనాది. మావునీకేటీయియ్యనేదు.ఏటప్పగించినాంకొడుక్కని బతికుండమంటావు ర్నాయినా " అంది.

" ఒలమ్మ, ఆ పొలం వుండి అయ్యేటిసుక పడిపోన్డే ? బతికినన్నాళ్ళు గజింబట్టేనా కట్టకంట,గోసి యెట్టుకొని, బుర్దలో నే దొల్లి, బుర్దేతిని కష్టపడ్డాడు. అయితాడికేటానామిగిల్నాదా? మనవి మెరకలు-పండిసావ్వు. పండిన్నాడేనా, పట్టెడు గింజలు మనం వుడకబెట్టుకొని తిన్నాఁవేటే అమ్మా? ఆ కోఁవిటోడికేసెల్లు మనపంటలన్నీ. అనాటి పొలంపోనాదని యేడుపేలే? అన్నాడప్పలసాఁవి.

" నాయినా, నువ్వు సిన్నోడివి, నీకు తెల్దురా! కసింత పొలంవేన్నేకపోతే, నివ్వు రైతువని ఎవుడంటార్రా? ఆలెక్కన మనవేలుండాల యీమడకని? కూలోల్ల నైపోయి పట్నాలంట ఎల్లిపోవాల! నేకపోతే, ఆడి పొలంల వుడుపుకని, యీడిపొలంల గొప్పుకని కూలికెల్లాల. సేరడో, మూరడో, పొలంసెక్క వున్నాదనిపిచ్చుకోని, యిప్పుడది పోనాదని, కూలీ బతుకు బతకాలంటే-యేల్రా బతుకునాయినా? సస్తినయిఁవ్. ఆ బతుకు బతకనేక మీయయ్యి సచ్చిపోన్డు, నానుండిపోన్ను" అంది నర్సమ్మ.

" అయితదన్న మాట నీ మనుసుల బాద. అమ్మా,ఒలమ్మ,నామాటమీద కసింత ఏదస్తుంచుకోయే. రెండు సఁవచ్చరాలు తిరిగే తప్పటికినానూ పొలం కొంటాను. సూడే! నాన్నిజివైన కొడుకుని అవునో కాదో సూస్తావుగదా ! మన మడకని పొలాలే దొరకవా కొన్నానికి - ఎక్కడ సూసినా అమ్మకానికి పెట్టివోళ్ళే; కానీ, కొనే మగోడేనేడు, కొఁవిటోడు తప్ప. అంచేత మర్నాసంగతీ సూడు-కొనే మొగాడ్నవునో కాదో ! నీకొడుకెంతటోడో సూడాలంటే, నువ్వు బతికుండాల. నెగు నెగు, నెగిసెల్లి యీ పొద్దు కాడ్నుండి కరట్టుగ అంబలి తిను, అయినకోసారి పొలాలంటగొర్రిపిల్లల్నీ మేపు కొట్టికెల్లు. నాను టౌన్ల కూలి కెల్తాను." అన్నాడు.

కొడుకు ప్రతాపం చూడాలనివుందో ఏఁవిటో నీర్సంగా, విచారంగా కూర్చోవడం మానేసింది నర్సమ్మ. అటూ యిటూ తిరగడం, కంపల్ని విరిసిపొయ్యిలోకి తేవడం, పశువుల వెనకాతల తట్టు పట్టుకు వెళ్ళి పేడపోగు చేస్కురావడం మొదలెట్టింది. అత్త చేస్తున్న సాయానికి కొండంత పొంగిపోయింది కోడలు.

నర్సమ్మ కొడుకు అప్పలసామీ జాగ్రత్తయిన వాడే. తాగడం నేర్చుకోలేదు, పట్నం షోకులు నేర్చుకోలేదు, చివరికి సినిమాల్చూడ్డాం కూడా నేర్చుకోలేదు. పోయిన మడి చెక్కల్ని తిరిగి సంపాదించేయాలని, వూర్లో "పొలెప్పిగాడి కొడుకు అప్పలసామి గాడు గనమైన మనిసిరా ?" అని అనిపించు కోవాలని ఒకటే తాపత్రయం వాడికి. యధాశక్తి పడ్తున్నాడుబాధ. శ్రీనివాసా మెడికల్ షాపులో బంట్రోతుగా చేరేడు. ఆ కొట్లో డబ్బు చూస్తుంటే వాడికళ్ళు తిరిగి పోతూవుండేవి. రోజుక్కనీసం రెండు వేల్రూపాయల అమ్మకం వుండేది షాపులో. ఆ రెండు వేల్రూపాయల్లోంచి రెండ్రూపాయలు తీసి, వీడిక్కూలిగా యిచ్చేవారు షాపు ప్రొప్రయిటరు, ఆ రెండ్రూపాయిల్లోంచి వీడెంత మిగిల్చే వాడన్నది కాదు ప్రశ్న - మిగిల్చేవాడు, ఎంతోకొంత - అదీ కావల్సిన సంగతి. నిజంగా రెండు సంవత్సరాల్నాటికి వాడి దగ్గర నాలుగు వందలు పోగయేయి. పోలెప్పిగాని వాడి తండ్రిగాని-ఆ మాట కొస్తే వాళ్ళ కుటుంబంలో ఎవ్వడుగాని-ఏనాడూ కళ్ళ చూసివుండని మొత్తం అన్నమాట నాలుగు వందలంటే. అందరికీ కళ్ళు జిగేలు మన్నాయి. అప్పలసాఁవి కయితే స్వర్గం దొరికిపోయినంత సంతోషం కలిగింది. వెంటనే వెళ్ళేడు మంత్రాల రాఁవయ్య దగ్గరికి. వాడి పేరసలు

బగ్గు రాఁవయ్య. తేలుమంత్రం, దిష్టిమంత్రం, కురుపులు తగ్గడానికి మంత్రం-యివి వాడికిటాగా వచ్చునట. దాంతో చుట్టు పట్ల వూళ్ళన్నిటికీ వాడు మంత్రాల రాఁవయ్య అయి కూర్చున్నాడు.

ఈ మంత్రాల రాఁవయ్య రెండేళ్ళ కిందట సెట్టోడి పేట చెట్టు పోతయ్య దగ్గర ఎకరం పొలంకొన్నాడు. పొలం నందిగాడి చెరువుక్రిందనుంది. చెరువులో నీళ్ళుంటే పొలంకి నీరందుతుంది. కాని వీడా పొలం కొన్నప్పట్నుండి వానల్లేక, పెట్టిన పంటల్లా నాశనఁవై పోయింది. అప్పుల బాధ పడ్లేక పొలాన్ని అమ్మకానికి పెట్టేడు. అయితే, వీడంటే అమ్మకానికి పెట్టేడుగాని, మెరక పొలాన్నికొనే నాధుడేడీ? ఇలాటి పరిస్థితులలో పొలంకొంటానని వొచ్చిన అప్పలఁసావి యీ రాఁవయ్యగాడి కళ్ళకి, పెంటలవీధి కోవిల్లోవున్న రాఁవుల వారిలా కనిపించేడు.

బేరాల్లోకి దిగేరు. రోజుల్లా పట్లుపడుతూనే వున్నారు. "నీకు ఎరికినేదేట్రా, సెట్టోడిపేట బుగత, ఆల్లయ్య సచ్చిపోతే, కారిఁవ్ (పెద్దకార్యం) సెయ్యినానికి డబ్బునేక బంగారంనాటి యీ పొలాన్ని నాలుగొందల కమ్మీసినాడు సెట్టోడికి.ఆడుఅప్పులుపాలైపోయి నా కమ్మీసినాడయిదొందలకి'' రాఁవయ్య మాటని, గభీమని నరికేస్తూ అప్పలసాఁవి అన్నాడు కదా- 'నీవు అప్పులపాలైపోయి నా కమ్మీయాలనిసూస్తున్నావు అంతేనా! అని గొల్లున్నవ్వేడు. కాని రాఁవయ్య నవ్వలేదు. 'నివ్వు సెప్పింది నిజవేఁన. అప్పులు పడ్నేకే అమ్మేస్తున్నాను. కానొరే, అప్పలసాఁవి నీ కింక సిన్నతనం! పీ యయ్యి పొలఁవేల అమ్మీసినాడో నీకు తెల్దా? మన్లాటి నాదారి రైతులు పొలం నిలబెట్టు కోనానికి మనకేటుందిరా ఆదరువు? గవుర్మెంటు లోన్లు మల్లాటి సిన్నరైతులకి యిస్తున్నావో అని గోలే! ఏనాడే నా మనకి ముట్టినా యేటి లోన్లు? పంచాతీ పెసెంట్లుకి, సఁవితి పెసెంట్లకి, యింకా మోతుబరోళ్ళకీ-యీళ్ళకే ముడతన్నాయిలోన్లు. ఆల్లకేఁవో యీ డబ్బు పులగం మీద పప్పునాటిది. ఈళ్ళు గవుర్మెంటు నుండందుకున్న లోన్లు మన్లాటోల్లకి అప్పులిచ్చి, వొడ్డీలు గుంజీ, పొలాఁలాపించేసుకొనీ పెద్దోలవుతున్నారు. నీకు సత్తువుందా కిందోమీదోపడి పొలం నిలబెట్టుకుంటావు. సత్తు విరిగిన మర్నాడు-నక్కపోతు కోడిపిల్లని నొక్కిసినట్టు, యీ డబ్బున్నోల్లు మన్లాటోల్లని నొక్కేసి మనకున్న సెక్కాముక్కా ఎండేస్తారు. అయితదాలగుండ్నీ-నానయిదొందలకి కొన్న పొలం, నీకు నాలుగొందలకిచ్చీమంటావు గదా - మర్నాకు పూరాగా అప్పు తీరదు - పొలఁవూ పోతాది-మరేఁలా ఆయమ్మకం'' అన్నాడు బగ్గు రాఁవయ్య.

విసిగిపోయాడు అప్పలసాఁవి. ఇది గ్రహించేడు రాఁవయ్య. ఆఖరిదరువుకింద అన్నాడు 'అదికాదు రప్పలసాఁవీ, సెడిపోయి తెగుదెంపుల్సేసుకోనానికేకదా పొలాన్ని అమ్మకానికెట్టి నాను-దానమ్మ, నా నెట్టిన కర్సేనా రాకపోతే....'' నసిగేడు.

బీడి తీసి, కొసగిల్లేసి, వేళ్ళతోనలిపి, పళ్ళకు మధ్యని బిగించి వెలింగించేడు అప్పలసాఁవి. రెండుదమ్ముల్ని పీల్చేక అన్నాడు " రాఁవయ్యా-నివ్వు సెడిపోయి పొలాన్ని నాకమ్మీరా అని నానెలా

సెప్పగల్ను ? నాయవస్త కూడా కసెంత కనిపెట్టరా ! నాకాడున్నాయి నాలుగొందలు. అందలోదే నీ కివ్వాల, రిజస్ట్రీకర్సు లెట్టుకోవాల, ఆఫీసుకాడ బంట్రోతులు కాడ్నుండి రిజిష్టారుదాకా అంతమందికీ కస్పీలిచ్చుకోవాల, కర్ణంమల్లీసుర్రావుని రిక్సాలో ఆఫీసుకొట్టికెల్లాల, అడికక్కడ సేపా, మాంసంవ్‌తో బోయినవెట్టించాల, కాయితాబు రాయిచ్చినందుకు కట్నం సదివించుకోవాల - ఇన్నికర్సులున్నాయి కదా-మర్నీ నెందలబడి పోవాల? సూస్తే నాలుగొందలున్నాయి నాకాడ - నివ్వయితే కొన్నదర యిమ్మంటన్నవ్. నివ్వు సెప్పిందీ దరమంవేలే. నివ్వెట్టిన మదుపు అయిదొందలూ రాకపోతే మరెలా అమ్మడం? రాంవయ్య, మనకితెగదురా-నివ్వు మరోకాడ బేరంసూస్కో, నాను మరోమడకని పొలం సూస్కుంటాను'.

లేచి వెళ్ళిపోయాడు అప్పలసాంవి. ఇలా బేరం చెడిపోయి నందుకు యిద్దరూ విసవిసలాడుతూనే వున్నారు. ఈ పొలం దొరికితే యింటికి దగ్గరగా వుంటుందని ఆశపడ్డాడు అప్పలసాంవి. పొలంలో బక్కా, బడుగు దూరినా యింటి ముందుకూర్చుంటే అవుపిస్తుంది, కేకవేసి అదురుకోవచ్చును అని ఎంతో సంబరపడ్డాడు. కాని వ్యవహారం చెడిపోయింది.

రాంవయ్య పరిస్థితీ అలానేవుంది షావుకారు దగ్గర తీసుకున్న అప్పుమీద వడ్డీ పెరిగిపోతొంది. భూంవిని అమ్మకానికి పెట్టి ఏడాదయింది. కాని యింత వర్కూ కొంటానని ముందు కొచ్చిన మొనగాడే లేడు. ఇవాళ అప్పలసాంవిగాడు వొచ్చేడంటే, వాడిచ్చే డబ్బుతో అప్పే తీరదు-మరెందుకా అమ్ముకోవడం.

పుగాకు నవుల్తూ. రంగడి టీ బడ్డీలో దూరేడు రాంవయ్య. టీ పడే సర్కి కొత్త ఆలోచన వొచ్చింది. వురుకుల్తోని, పరుగుల్తోని అప్పలసాంవి యింటికి చేరుకున్నాడు.

ఆలోచన్లో వున్నాడు అప్పలసాంవి. ఆలోచిస్తూ, ఎటోసూస్తూ, గొర్రెపోతునోట్లో, గడ్డికుదుళ్ళు కూరుతున్నాడు. (పొట్టేలుని పందేలకి తయారు చేసే పనిలో గడ్డితినిపించడం ఒకభాగం పచ్చగడ్డి కుదుళ్ళని నోటికి అందించి తినిపిస్తారు. కాని ఆ గడ్డిని పూర్తిగా నవిలి తినేదాకా వ్యవధి యివ్వరు గొర్రె పోతుకి-గబగబ కూరేస్తారునోట్లో. ఇలా చేస్తే బలంగా తయారవు తుందని వాళ్ళ నమ్మకం.)

మంత్రాల రాంవయ్య పలకరించేడు అప్పలసాంవిని. తలతిప్పి చూసి " ఏట్రా, మల్లింతలోనే పారొచ్చినావు, యేటేనా తెగిందెటి ఆలోసన?" అనడిగేడప్పలసాంవి.

" అదేన్ర. ఓ పన్జేస్తే యెనాగుంటుదో నిన్నడగాలని పారొచ్చినాను. అప్పల్సాంవోరే, దైవసాచ్చిగా సెపతన్నాను-నాకు నాబవేటక్కర్నేదుర, నానెట్టిన మదుపు నాకెలిపొస్తేసాలు. నీకాడసూస్తే నాలుగొందలే వున్నాయంటున్నావ్. నానొక మాటనేస్తాను-నివ్వేటీ అనుకోనంటే."

" సెప్పుర్రాంవియ్య, సల్లకొచ్చి ముంతేల్దాసాలా !"

" మరేట్నేదురా, నాయప్పుతీర్నట్టుంటుంది' నీకుబూ౦వి దక్కినట్టూ వుంటాది-నాన్సెప్పితే సావుకోరునూరో, నూటేబ్బియ్యో అప్పిస్తాడునీకు. నా ఆయిదొందలు నాకిచ్చి. ఒక్కేడాది పండిందంటే , అప్పిరిగిపోద్ది"అప్పలసా౦వి ఓ విధంగా తుళ్ళిపడ్డాడనే చెప్పాలి- ఎంచేతంటేగడ్డిమిం గుతున్న గొ౦౦రై గభీమని తుళ్ళిపడింది కాబట్టి. అప్పుచేసి తీర్చలేక తన తండ్రి పొలం అమ్మేసుకున్నాడు. ఇప్పుడీ రావయ్య అప్పులబాధ పడ్లేక పొలం అమ్మేయాలని చూస్తున్నాడు తనకి. మరితెలిస్తేలిసి తనుకూడా అప్పులోకి దిగితే - పొలంకొనడానికే అయినా...

కసింత ఆలోసిస్తే అంతకంటే మరో మార్గం కనపడ్డంలేదు. పొలం కొనాలంటే ప్రస్తుతానికి అదొక్కటే పద్ధతి. అయినా ఆలోచించి చెపతానన్నాడురావ౦య్యతో. సాయింత్రం " సెరూదక్కు యెల్లీటప్పుడోపాలి" రమ్మన్నాడు.

అమ్మకి చెపితే, అప్పుచేసి పప్పుకూడు ఒద్దుగాక వొద్దు అనేస్తుంది. అందుకని పెళ్ళాంతో సలహాచేసేడు. " రెక్కలు ముక్కలు సేసుకొని కష్టపడితే తల్లి మాలచ్చి భూదేవి మన కన్నాయం సేస్తాదేటి- మరో ఆలోసనెట్టుకోకు- సావుకారు దగ్గిర వొందో, యేబియ్యో వోడి పొలంకొనీ " అని సలహా యిచ్చింది పెళ్ళాం.

ఆ విధంగా పొలంకొండానికి వంద రూపాయిలు అప్పుతీసుకున్నాడు అప్పలసామి షావుకారు దగ్గర. ఆ డబ్బు చాల్లేదు. రిజిస్ట్రేషన్ ఖర్చులకోసం, యితర అమాంబాపతులకోసం తను ప్రాణప్రదంగా పెంచుకొస్తున్న గొ౦౦రైపోతులు రెండింటిని అమ్మేసేడు. కొన్నపొలం బాగుచెయ్యడానికీ, వ్యవసాయపు మదుపులకీ షావుకారి దగ్గర మరో వందవాడేడు.

మూడేళ్ళయింది అప్పలసా౦వి పొలంకొని. చచ్చిపోయిన పోలేప్పులు, బతికి చెడిపోయిన రా౦వయ్యలు-వీళ్ళను మించినవాడు కాదే యీ అప్పలసా౦వి ! వాళ్ళలాగే నానా బాధలూ పడ్డాడు పొలం నిలబెట్టుకోడానికి. అయితే, పల్లెటూళ్ళలో షావుకార్ల అప్పుల సాలెగూడు నుండి బయటపడ్డవాళ్ళు- బహూశా నూటికో, కోటికో ఒక్కరుండవచ్చు. అందరికీ ఏగతి పడుతుందో, పట్టిందో- అదేగతి పట్టింది అప్పలసా౦వికి.

మళ్ళీ శ్రీనివాసా మెడికల్ షాపులో బంట్రోతు పన్లో చేరాడు. " నీ యిష్ట౦వొచ్చినప్పుడు వొస్తూవుండడానికి- యిదేం అత్తవారిల్లనుకున్నావేవిటి, పో, యిక్కడేంపన్లేదు" అని కుక్కను గసిర్నట్టు గసిరేడు అప్పలసా౦విని, మందులకొట్టు ప్రొప్రయిటర్. అయితే, అప్పలసా౦వి వొదలకుండా కాళ్ళావేళ్ళా పడ్డాడు. వీడి బలహీనత కనిపెట్టి, బాగా బతిమాలించుకుని ఆమీదట "రూపాయి ముప్పావలానే కూలికింద యిస్తాను రోజువారీ, నీ కిష్టమైతే వుండు, లేక పోతే పో" అన్నాడా ప్రొప్రయిటర్. అదే మహా ప్రసాదమని అంతకే ఒప్పుకొని పన్లో కుదిరేడు అప్పలసా౦వి.

(జూన్ 1979 - అభ్యుదయ )

✪✪✪